# యువజనులు, విద్యార్థులు
# కార్మికవర్గ రాజకీయ పతాక క్రింద సమీకృతం కావాలి

**భారతదేశం**–అర్థవలస, అర్థభూస్వామ్య సమాజం. దీనిలో ప్రధాన వైరుధ్యం ఏమిటి? సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ బూర్జువా వర్గం ఒకవైపున, మరోవైపున అశేష ప్రజానీకం. వీటిమధ్య ప్రధాన వైరుధ్యం వుంటుంది. కార్మికులు, రైతాంగం, చిన్న వ్యాపారులు, పెటీబూర్జువా వర్గం మరియు జాతీయ బూర్జువావర్గాలు–దోపిడీకి గురయ్యే వర్గాలుగా–ప్రజానీకంలో భాగంగా వున్నారు. పెటీబూర్జువా వర్గంలో మేధోవిభాగానికి చెందినవారు–ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యాలయ ఉద్యోగులు, ఇంజనీర్లు, వైద్యులు మొదలైన వారు వున్నారు. వీరంతా దోపిడీకి గురయ్యే ప్రజానీకంలో భాగం. ప్రజాసాయుధ పోరాటంద్వారా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో నిర్మితమయ్యే జనతా ప్రజాస్వామిక రాజ్యమే భారత సమాజంలో ప్రధానవైరుధ్య పరిష్కారానికి ఏకైక పరిష్కార మార్గం. దేశంలోని పీడిత ప్రజలందరినీ ఐక్యంచేస్తూ సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య విధానాన్ని వ్యతిరేకించే ఓ విప్లవ ఐక్యసంఘటన ఏర్పడాలి. ఈ ఐక్యసంఘటన భూస్వామ్య విధానాన్ని, దళారీ పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేయటంతో పాటు, దేశంనుండి సామ్రాజ్యవాదాన్ని పెకిలించి వేస్తుంది.

**విప్లవ ఐక్యసంఘటన–మేధావి వర్గం**

కనుక, రైతాంగం ప్రధానశక్తిగా కార్మికవర్గం యొక్క రాజకీయపార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో విప్లవ ఐక్యసంఘటన ఏర్పరచటం మొట్టమొదటి జరూరు కర్తవ్యం. పాలక కూటమిచే దుర్మార్గమైన అణచివేతకు గురయ్యే ఇతర వర్గాలు, ప్రజలు మొదటి వరుసలో శక్తివంతమైన మిత్రులుగా వుంటారు. వారిలో పెటీబూర్జువా వర్గం, బుద్ధి జీవులు, విద్యార్థిలోకం పెద్ద విభాగంగా వుంటారు. కనుక, విప్లవ ఐక్యసంఘటనలోకి వారిని తీసుకు రావటం అత్యావశ్యకమైనది. నిజాయితీ, దేశభక్తి కలిగిన మేధావివర్గంలోని ప్రతి ఒక్కరినీ ఐక్య సంఘటనలోకి తీసుకొచ్చి, ఐక్య సంఘటనలో వారిని భాగంచేయాలి. “యువజన ప్రజానీకం సమాజంలో అత్యంత చురుకైన, అతిముఖ్యమైన శక్తి. నేర్చుకోవటానికి వారు అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తారు; వారి ఆలోచనల్లో అతి తక్కువ ఛాందసంగా వుంటారు” అనేదే దీనికి కారణం.

యువజనులలో విద్యార్థులు అతిపెద్ద విభాగం. కనుక జనతా ప్రజాస్వామిక విప్లవంలో విద్యార్థుల పాత్ర చిన్నదికాదు. వివిధ సామాజిక కారణాలరీత్యా కార్మికులు, రైతాంగం కంటే భిన్నంగా వారికి చదువుకునే అవకాశం లభించింది. కార్మికులను, రైతాంగాన్ని సంఘటితపరిచి, వారిలో విప్లవ భావాలను ప్రచారం చేయడానికి బుద్ధిజీవుల సహకారం ఎంతైనా అవసరం. పార్టీలో వారిని చేర్చుకోవటమే చాలదు. వారి వర్గస్వభావాన్ని మార్చి, కార్మికవర్గ భావజాలంపై వారి మనసు లగ్నం చేయించాలి. వారిని కార్మికులుగా మార్చు కోవటమే అంతిమ లక్ష్యం. వారి సహకారంతో కార్మికవర్గంనుండి మేధావులను సృష్టించాలి. పాలక వర్గం ఎల్లవేళలా తమ అవసరాలకనుగుణంగా తూగే విధంగా బుద్ధిజీవులను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తుంది. వారి ఆటను సాగనీయకుండా చేయటమే విప్లవకారుల కర్తవ్యం.

**మేధావివర్గం: విప్లవ ఐక్యసంఘటనలో ఒక శక్తి**

భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటనలో మేధావివర్గం, విద్యార్థులు బలమైన శక్తిగా వుంటారనేది వాస్తవం. అయితే, వారిపై ఆధారపడటం ద్వారానే విప్లవాలు పరిపూర్తి అవుతాయా? కావు. ఎందుకంటే, విప్లవ పోరాటంలో వారు ప్రధానశక్తి కాదు కనుక. ఎందుకు కాదు? విప్లవ పోరాటానికి వారెందుకు నాయకత్వం వహించలేరు? వారికి చాలా విషయాలు తెలుసు; వారెన్నో నేర్చుకున్నారుకదా! దీనికి కారణాలను మూడు అంశాలుగా విభజించవచ్చు.

మొదటి అంశం: పెట్టుబడిదారీ సమాజంలో అత్యంత పురోగామి విభాగము కార్మికవర్గమే. అత్యాధునిక ఉత్పత్తివ్యవస్థతో వారు అనుసంధానమై వున్నారు. ఈ వర్గమే అత్యంత సంఘటితమైనది, అత్యంత ఐక్యంగా వుండేది. బానిస సంకెళ్ళు తప్ప, వీరు మరేమీ పోగొట్టుకునేది లేదు కనుక ఈ వర్గమే అత్యంత నిస్వార్థమైనది. కనుక, ఎలాంటి తటపటా యింపులూ లేక వారు పోరాటంలోకి దూకటమేగాక, ఎలాంటి త్యాగాలకైనా వెనుదీయరు. అదే సమయంలో, తాము చదువుకున్నామనే అహంకారం కలిగిన కొందరు గొప్ప మేధావులలాగా వీరు వ్యవహరించరు. ఈ కారణంచేత, కార్మికవర్గం మాత్రమే విప్లవానికి నాయకత్వం అందించ గలుగుతుంది. కార్మికవర్గానికుండే ఈ ప్రత్యేకతలు మేధావివర్గం మరియు విద్యార్థిలోకంలో కొరవగా వుంటాయి. కనుక, విప్లవ పోరాటానికి వారు నాయకత్వం వహింపజాలరు.

రెండవ అంశం: మేధావివర్గం ప్రధానంగా పెటీబూర్జువా వర్గానికి చెందిన వారు. పెటీబూర్జువా వర్గం పరాన్నభుక్కు స్వభావం కలిగి వుంటుంది. ప్రత్యక్షంగా వారు దోపిడీ చేయకున్నా, దోపిడీ ఫలాలలో వారు భాగం పంచుకుంటారు. వారు ఒకే సందర్భంలో

దోపిడీ చేసే వారుగానూ, దోపిడీకి గురయ్యేవారిగానూ వుంటారు. ఉత్పత్తిశక్తుల అభివృద్ధి ప్రాతిపదికపై సమాజం పురోగమిస్తుంది. ఉత్పత్తిశక్తుల అభివృద్ధిక్రమంలో నిర్దిష్ట ఉత్పత్తి సంబంధం ఆటంకంగా మారినపుడు, ఆ ఉత్పత్తి సంబంధాన్ని మార్చుకోకుంటే, సమాజ పురోగమనం దెబ్బతింటుంది. ఉత్పత్తిశక్తుల పెరుగుదలను ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలు అడ్డగించేట్లయితే, పెట్టుబడిదారీ నూతన ఉత్పత్తి సంబంధాలు సృష్టించబడతాయి. నూతనంగా జన్మించిన పెట్టుబడిదారీ వర్గం దీని చోదకశక్తి. ఫ్యూడలిజం స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చింది. ఈనాడు పెట్టుబడిదారీ సంబంధాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్ళలేవు. నూతన సంబంధాలు ఉనికిలోకి రావల్సివుంది. ఆ నూతన సంబంధాలు సామ్యవాద వ్యవస్థగా, దాని చోదకశక్తి కార్మికవర్గంగా వుంటుంది. విశాల రైతాంగ ప్రజానీకంతో మైత్రి ప్రాతిపదికన ఈ నూతన సమాజాన్ని నిర్మించాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో సామ్యవాదవ్యవస్థ ఏర్పడుతుంది. కుళ్ళిన గత పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో భాగస్వాములుగా వున్న పెటీబూర్జువా వర్గం, ఈ సామాజిక మార్పు వెనుక ప్రధానశక్తిగా వుండజాలదు; ఈ క్రమానికి నాయకత్వం వహించ జాలదు.

మూడవ అంశం: మేధావి వర్గానికి చెందిన వారు–బాగా చదువుకున్నవారని, వారికి అన్నీ తెలుసుననీ చాలామంది అనుకొంటూవుంటారు. కానీ ఇది వాస్తవం కాదు. వారు ఎంతగా చదువు కున్నవారైనా వారి జ్ఞానమంతా పుస్తకాధ్యయనం ద్వారా పొందినదే కనుక, అది పాక్షికమైనది; అసంపూర్ణమైనదే. శ్రమచేయటం ద్వారా, సామాజిక కార్యాచరణలో విజ్ఞానాన్ని అన్వయించటంద్వారానే నిజమైన జ్ఞానం లభిస్తుంది. ఉత్పత్తి కార్యక్రమాలలో పాల్గొనకుండా, వర్గపోరాటంలో చేరకుండా ఏ జ్ఞానమూ పరిపూర్ణం కాదు. ఏదేనీ ఒక అంశాన్ని గురించి ఎవరైనా పరిపూర్ణ జ్ఞానాన్ని పొందాలను కుంటే, దానితో అతను లేదా ఆమె ప్రత్యక్ష సంబంధంలోకి వెళ్ళాలి. దానిలో చేతులుంచాలి. అలాకాకుంటే, వారి జ్ఞానం అసంపూర్ణమైనదిగానే మిగిలిపోతుంది.

కనుక సామాజిక ఆచరణలో ఏదేనీ ఒక ఉత్పత్తి క్రమంలో పాలుపంచుకోవటం ప్రధాన మైనది. ఈ కారణం చేతనే, పుస్తక అధ్యయన పరమైన జ్ఞానం కొరతగా వున్నప్పటికీ, మేధావి వర్గానికి చెందిన వారికంటే కార్మికులు, రైతాంగమే ఎక్కువ తెలుసుకోగలిగిన వారుగా వుంటారు. ఉత్పత్తి క్రమంలో పాల్గొంటున్నవారుగా, సామాజిక పరివర్తనకు సాధనమైనవారుగా, విప్లవ కర్తవ్యాన్ని, ఆవిధంగా చారిత్రక అభివృద్ధి క్రమాన్ని ముందుకు గొనిపోతారు. ఈ అనుభవంలేని మేధావివర్గానికి కేవలం పాక్షిక అవగాహన మాత్రమే వుంటుంది. కనుక, వారు విప్లవోద్యమ నాయకత్వానికి చెందరు.

మనదేశంలో దళారీవర్గాన్ని రూపొందించే ప్రయోజనంతో వలసపాలకులు ఈ విద్యావ్యవస్థను సృష్టించారు. సామ్రాజ్యవాద దోపిడీ సాగించటానికి, ఫ్యూడల్ తరహా సంబంధాలను కాపాడేందుకు అవసరమైన మానవశక్తిని ఈనాటి ఈ విద్యావ్యవస్థ సరఫరా చేసేదిగా వుంది. దోపిడీని పెంపొందించ టానికి మనిషిని పోలిన రోబోలను ఉత్పత్తిచేయటం విద్యావ్యవస్థ ప్రయోజనంగా వుంది. సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థల పనుపున మనదేశ పాలకులు అమలు చేస్తున్న నయాఉదారవాద విధానాలు, విద్యా వ్యవస్థను లాభార్జనా విభాగంగా రూపొందించాయి. అదే సమయంలో, మనదేశ యువజనులను సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించే పరికరాలుగా మలిచేందుకు తప్ప, మనకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిచేసుకునేందుకు అవసరమైన శాస్త్రీయ జ్ఞానాన్ని అందించకుండా వుండేవిధంగా ఈ విద్యావ్యవస్థను రూపకల్పన చేశారు. ఇది సామ్రాజ్యవాద దేశాలపై మన పరాధీనతను శాశ్వతమొనరుస్తుంది. ఈ వ్యవస్థ గురించి భ్రమలు తొలగించుకొనని వారెవరైనా, సారాంశంలో దోపిడీ వర్గాలకు మాత్రమే సహకరించే వారుగా, కార్మికవర్గ రాజకీయాలను గ్రహించలేనివారుగా మిగిలిపోతారు.

**దోపిడీకి గురయ్యే పెటీబూర్జువా వర్గం**

పెటీబూర్జువా మేధావివర్గం కూడా దోపిడీకి గురవుతోంది. ఏవిధంగా? అత్యధికులు ఉద్యోగు లుగా వుండి వేతనాలపై ఆధారపడి వుంటారు. సరుకుల ధరల పెరుగుదలకనుగుణంగా వారి జీతభత్యాలు పెరగవు. ఫలితంగా, రోజురోజుకీ వారి పరిస్థితి దిగజారుతుంది. ప్రత్యేకించి, పెద్దమనిషి తరహా జీవన విధానాన్ని కాపాడుకోవటానికి వారు మరింత అవస్థపడతారు. అన్నివైపులా చుట్టుముట్టిన సంక్షోభంయొక్క అనివార్య ఫలితమైన నిరుద్యోగం భీకరాకృతిదాల్చింది. విద్యార్థులెవరూ ఉద్యోగం వస్తుందని ఆశించే పరిస్థితిలేదు. ఇలాంటి ఆర్థిక సంక్షోభ పరిస్థితులలో, విద్యార్థులు, మేధావులు తమ అస్తిత్వాన్ని నిలుపుకోలేక, వర్గభ్రష్టత్వానికి లోనవు తున్నారు. వీరంతా భారీ దోపిడీవర్గ యంత్రమైన పెట్టుబడిదారీ విధాన సాధారణ బాధితులుగా వున్నారు.

పెద్దఎత్తున ప్రచారం చేసుకొన్న స్వేచ్ఛావాణిజ్య విధానం–చిన్న చేపలను పెద్దచేపలు దిగమింగే క్రూరమైన క్రీడకు ముసుగు మాత్రమే.

పెటీబూర్జువా వర్గానికి వేర్లు లేవు. బూర్జువా వర్గానికి చేరువై వారిలో కలవటం వారి శక్తికి మించినది. అయితే, అదే సందర్భంలో కార్మిక వర్గంలో ఒకరుగా వున్నందుకు వారెంతో న్యూనతా భావంతో వుంటారు. ఏమైనా, చివరకు తమ ప్రయోజనాలరీత్యా ప్రగతిశీల, ప్రజాస్వామ్య కూటమిలో చేరటం జరుగుతుంది. శ్రామికవర్గ ప్రజానీకపు విముక్తే తమ విముక్తికూడా. వారు కూడా దోపిడీకి గురవుతారు. తేడా అల్లా, కార్మికులు, రైతాంగం మరింత ప్రత్యక్షంగా దోపిడీకి గురవుతారు. కనుక, మేధావివర్గం విప్లవ వర్గాల ఐక్యసంఘటనలోకి రావాలి; మరో మార్గం లేదు.

విద్యార్థులు దోపిడీకి గురయ్యే మరో విభాగం. ఆర్థికదోపిడీ అని మాత్రమేగాక, విద్యారంగ పరిధిలో వారు దోపిడీకి గురవుతున్నారు. వారు చదువుకునే చదువు, ప్రజలకు సేవచేసేందుకు ఏవిధంగానూ తోడ్పడేదిగా లేదు. ప్రజలను దోపిడీ చేసుకోవటానికి తగినవారుగా మాత్రమే వారిని ఈ విద్యావ్యవస్థ మలుస్తోంది.వారు నేర్చుకునే పుస్తక పరిజ్ఞానమంతా, వాస్తవ జీవితానికి ఏమాత్రం సంబంధంలేనిదిగా వుంది. ఒక విశాలయంత్రంలో తిరుగాడే ముళ్ళులాగా తమను మలిచారని వారు తర్వాత గుర్తిస్తారు. ప్రజలకు వ్యతిరేకంగా ఆయుధాలు ధరించి ఆవలి పక్షాన వున్నట్లు తామే గుర్తిస్తారు. పెడదోవపట్టిన ఈ వ్యవస్థ డబ్బు చెల్లింపుల చుట్టూ తిరిగే బలహీనులను మాత్రమే తయారుచేస్తుంది.

ఈ వ్యవస్థలో తను చదవదలుచుకున్న అంశాన్ని ఎంచుకునే అవకాశం విద్యార్థికి లేదు. కేవలం ఉద్యోగ సాధనే దీనికి ప్రాతిపదిక అవుతోంది. ఆంగ్ల సాహిత్యాన్ని చదవాలనుకున్న విద్యార్థి ఆర్థికశాస్త్రం అభ్యసించాల్సి వస్తోంది. ఈ వ్యవస్థలో స్వేచ్ఛాయుత వ్యక్తిత్వ వికాసం అనేది వట్టి మాయ మాత్రమే. విద్యేతర కార్యకలాపాలు ఈ వ్యవస్థలో నిరుత్సాహపరచబడతాయి. వారి ప్రతిభాపాటవాలు వృధా అవుతాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ నిషేధాల అస్తవ్యస్తలతో యువకులు తమ ఉత్సాహాన్నంతా కోల్పోతున్నారు. పాఠ్యాంశాల రూపకల్పనలోగానీ, బోధనా విధానంలోగానీ విద్యార్థుల పాత్ర ఏమీలేదు. పైగా, దోపిడీదారుల ప్రయోజనాలకు సేవచేయటానికి యజమానులు అంతులేని స్వేచ్ఛతో చర్యలు చేపడ్తున్నారు. పాలక వర్గాలకు, వారి యజమాని అయిన అమెరికా సామ్రాజ్యవాదానికి పనుపున ప్రతీఘాతుక విత్తనాలను వారు విద్యార్థులలో వెదజల్లి, అమెరికా దేశసంస్కృతి సుగుణాలను ప్రచారం చేస్తున్నారు.

ఈ వ్యవస్థను ఓడించి, కూలదొయ్యకుండా విద్యార్థి లోకానికి విముక్తి అసాధ్యం. దీనిని సాధించటానికి ప్రజల ప్రజాస్వామిక శక్తులతో, కార్మికులతో, రైతాంగంతో విద్యార్థులు కలిసి తీరాలి.

**యువ మేధావులారా, విద్యార్థి యువజనులారా ముందుకు రండి**

మేధావులు, విద్యార్థులు కార్మికవర్గంతో, రైతాంగంతో సంపూర్ణంగా కలగలిసిపోవాలి. వారిలో ఒకరుగా వుండాలి. ప్రజలలో ఒకరిగా వారు కలగలిసిపోయే ప్రయత్నంచేస్తే, విప్లవంనుండి వారిని దూరంగా నిలిపే వారి పెటీబూర్జువా మనస్తత్వం క్రమంగా అదృశ్యమైపోతుంది. ఈ మార్గంలో మాత్రమే వారు నిజమైన విప్లవకారులుగా రూపొంది, తమ వర్గ ప్రయోజనాన్ని సైతం వదులుకోని, ఒక పెద్ద లక్ష్యంకోసం తమకు తాము అంకితం చేసుకోగల్గుతారు. అప్పుడు మాత్రమే వారు ప్రగతిశీల వర్గాలతో మమేకం కాగలుగుతారు; వారి స్వీయవర్గ స్థితిని వదులుకోగలుగుతారు. అయితే ఈ కర్తవ్యం తేలికైనదేమీ కాదు. వారిలో ఈ మార్పును తీసుకురావలసి వుంది.

కార్మికులను, రైతాంగాన్ని ఐక్యపరిచి, సంఘటితపరచడానికి మేధావులు, విద్యార్థులు వారి మధ్యకు వెళ్ళాలి. వారిమధ్య రాజకీయ ప్రచారం గావించటం ప్రధాన కర్తవ్యం. మేధావులు, విద్యార్థులు ఈ రూపంలో శ్రామిక ప్రజారాశులలో రాజకీయ ఐక్యసంఘటనను రూపొందించటానికి సహకరించాలి.

**విద్యార్థుల వర్గ లక్షణమేమిటి?**

ఒక పెద్ద విభాగ యువమేధావులే విద్యార్థి లోకంగా వున్నారు. విద్యార్థులు ఏ ప్రత్యేక వర్గానికీ చెందినవారు కాదు. అన్నివర్గాల యువతీ యువకులు వీరిలో వున్నారు. వీరంతా వయసు రీత్యా యువజనులు. కనుక ప్రతీఘాతశక్తులు వీరిని కొద్దిగా ప్రభావితం చేస్తాయి. వీరిలో అమోఘమైన జీవశక్తి వుంది. నూతన విషయాలను తెలుసు కోవటంలో వీరు చాలా ఆసక్తిని ప్రదర్శిస్తారు. వీరి ఆలోచనలో ఛాందసత్వం తక్కువగా వుంటుంది. వీరికి న్యాయంపట్ల దృఢమైన స్పృహ వుంటుంది. వీరు అన్నివేళలా అన్యాయాన్ని వ్యతిరేకించటానికి సంసిద్ధంగా వుంటారు. వీరి అధీనంలో తగినంత సమయముండటం వీరికి ఒక గొప్ప సౌలభ్యంగా వుంటుంది. వీరు ఈ సమయాన్ని విప్లవకృషికి వెచ్చించవచ్చు. ఈవిధంగా విద్యార్థిలోకం యావత్తు ఎల్లవేళలా ప్రగతిశీలంగా వుండేదిగానూ, ప్రజల ప్రజాస్వామిక సంఘటనలో ఒక భాగస్వామిగానూ వుంటుంది.

**మావో ఆలోచనా విధం వెలుగులో నిన్ను నీవు తీర్చిదిద్దుకో**

“ఒక యువజనుడు విప్లవకారుడా, కాదా అని మనం ఎలా నిర్ణయించగలం? మనం ఎలా చెప్పగలం? దీనికి ఒక ప్రాతిపదిక వుంది. కార్మికులతో, విశాల రైతాంగ ప్రజారాశులతో మమేకమవటానికి అతను సంసిద్ధంగా వున్నాడా? లేదా?, ఆచరణలో ఆవిధంగా వున్నాడా, లేదా? అనేదే ఆ ప్రాతిపదిక. అతను అందుకు సంసిద్ధంగా వుండి, వాస్తవాచరణలోనూ అలానేవుంటే అతను ఓ విప్లవకారుడు; లేకుంటే అతను విప్లవకారుల కోవకు చెందినవాడు కాదు; లేదా విప్లవ ప్రతీఘాతకుడు. కార్మిక, రైతాంగ ప్రజారాశులతో ఈనాడు అతను మమేకమైవుంటే, ఈనాడు అతను ఒక విప్లవకారుడు; రేపు అతని ఆచరణ అలా లేకుంటే లేదా సాధారణ ప్రజలను అణచివేసే విధంగా పూర్తి విరుద్ధంగా మారితే, అపుడు అతను విప్లవకారులకోవలోనివాడు కాదు; లేదా విప్లవ ప్రతీఘాతుకుడు” అని మావో పేర్కొన్నాడు.

1919లో చారిత్రాత్మక మే 4 ఉద్యమ సందర్భంగా చైనా యువజనులు, విద్యార్థులు మొదటిశ్రేణిని ఆక్రమించారు. వారు దీనిని ఎలా చేయగలిగారు? దోపిడీకాడినుండి స్వాతంత్ర్యం పొందటానికి విప్లవ అవసరాన్ని మొదటగా మేధావులు,

విద్యార్థులు గుర్తించారు. వారు తమ చదువులనుండి పొందిన కొద్దిపాటి ప్రగతిశీల చైతన్యంతో దీనిని పొందగలిగారు. రాజకీయ చైతన్యం మరియు విప్లవ స్వీయత్యాగ లక్షణము కలగలిసిపోతే, ఆ మేధావులు విప్లవకారుల స్వభావాన్ని సంతరించుకోగలుగుతారు. యువజనులు, విద్యార్థులు మే 4 ఉద్యమం సందర్భంగా మొదటి శ్రేణిలో వుండి పోరాడారు. వారు విప్లవ రాజకీయాలను విశ్వసించటంతోపాటు, ప్రజానీకపు ప్రయోజనాలకోసం సర్వస్వాన్నీ త్యాగం చేయటానికి సిద్ధపడటమే దీనికి కారణం. దీని ఫలితంగా, వారు ధైర్యసాహసాలను ప్రదర్శించటమేగాక, ఉద్యమంలో నాయకత్వ పాత్ర నిర్వహించగల్గారు.

పైగా, చైనా కార్మికవర్గం ఆ సమయంలో అభివృద్ధిచెందిలేదు; మరియు సమైక్యంగానూ లేదు. కమ్యూనిస్టుపార్టీ ఇంకా అప్పటికి అక్కడ ఏర్పడిలేదు. ఫలితంగా, ఆ ఉద్యమానికి అలాంటి పార్టీ నాయకత్వపు లోటు వుంది. కనుక, కార్మిక వర్గం ఉద్యమానికి ముందు భాగానికి రాలేక పోయింది. ఈ పరిస్థితుల్లో మేధావులు, విద్యార్థులు తమ ప్రగతిశీల ఆలోచనలు, రాజకీయ చైతన్యంతో ఉద్యమానికి నాయకత్వం వహించారు. దేశ వ్యాపితంగా ఒక విప్లవకర ప్రభావాన్ని వారు సృష్టించారు. అయినప్పటికీ, చైనా విప్లవాన్ని విజయవంతంచేసే చోదక నాయకత్వశక్తిగా వారు వుండలేకపోయారు.

**విద్యార్థి ఉద్యమంలో ఒక ధోరణి**

కొందరు రాజకీయ నాయకులు 'విద్యార్థు లారా, విద్యాసంస్థలను వీడండి; గ్రామాలకు తరలండి; రైతాంగంతో మమేకం కండి; విప్లవ రాజకీయాలను ప్రచారం చేయండి' అని గతంలో పిలుపునిచ్చారు. పాఠశాలలకు, కళాశాలలకు హాజరవుతూ ఇవి చేపట్టటం సాధ్యంకాదు. కనుక, పాఠశాలలను, కళాశాలలను, విశ్వవిద్యాలయాలను విడిచిపెట్టి గ్రామాలకు వెళ్ళాలి. కుళ్ళిపోతున్న ఈ వ్యవస్థకు విద్యావ్యవస్థ ఆధారంగా వుంది. కనుక దీనిని ధ్వంసం చేయాలి. 'పరీక్షలను బహిష్కరించండి' వంటి నినాదాలు సబబైనవేనా? ఒక నినాదం సబబైనదో కాదో కనుగొనటానికి రెండు అంశాలను పరిశీలించాలి. మొదటిది–ఈ నినాదం ఎందుకు ఇవ్వబడుతోంది? రెండవ అంశం–ఈ నినాదం ఎప్పుడు ఇవ్వబడుతోంది?

1. ఒక విద్యార్థి కార్యకర్తను గ్రామానికి లేదా కార్మికవర్గంలోకి ఎందుకు పంపాలి? కమ్యూనిస్టులు ఒకే సమయంలో విద్యార్థిగానూ, ఉపాధ్యాయుని గానూ వుండి తీరాలి. ప్రజారాశులకు విప్లవ సిద్ధాంతాన్ని బోధించటానికి, అదే ప్రజారాశులకు విద్యార్థిగా కూడా వుండాలి. అప్పుడు మాత్రమే విప్లవ సిద్ధాంత ప్రచారానికి, కార్యకర్తగా తయారు గావటానికి తనకుతాను అర్హతపొందగలుగుతాడు. కనుక, విప్లవ సిద్ధాంత ప్రచారంచేసే ప్రయత్నంలో, అతను వారితో కలిసి నివసించాలి; వారి జీవితపు కష్టనష్టాలను పంచుకోవాలి. గ్రామాలలో రైతాంగంతో, పట్టణాలలో కార్మికులతో అతను కలిసివుండాల్సిన కారణమిదే. సంఖ్యాపరంగా అత్యధికులైన రైతాంగ ప్రజానీకం విప్లవశిబిరానికి దూరంగా వున్నారు. పెద్ద సంఖ్యలో రాజకీయ కార్యకర్తలను గ్రామీణ ప్రాంతంలో కేటాయించటం అవసరమైన చర్య. పెద్దసంఖ్యలో విప్లవ మేధావులను గ్రామాలకు పంపటంయొక్క అత్యావశ్యకత ఇక్కడే వుంది. ఇక్కడ కృషిచేయటానికి సిద్ధాంతజ్ఞానం అవసరమవుతుంది. సమయము, తగినంత శిక్షణకూడా దీనికి అవసరమౌతుంది. అయితే, 'కళాశాలలను వీడండి' నినాదమిచ్చి విద్యార్థులను ఇపుడు గ్రామాలకు ఎందుకు పంపుతున్నారు? వ్యక్తిగత నిర్మూలన చర్యలలో వారు పాల్గొనేందుకు అక్కడికి పంపించబడుతున్నారు. రహస్య గెరిల్లా యూనిట్ల ద్వారా స్థానిక ప్రతీ ఘాతుకులు ఒకరి తర్వాత ఒకరు హత్యగావించబడాలి; ఈ మార్గం ద్వారానే స్థానిక ప్రజలు మేల్కొంటారు అనేది 'విద్యాసంస్థలను వీడండి' అని నినాదమిచ్చే వారి ఆలోచన. ఈ నిర్మూలనా కార్యక్రమాలను 'చర్యల'ని పిలుస్తున్నారు. విద్యార్థులను గ్రామాలకు పంపటం, ఈ చర్యలలో పాల్గొనటానికి, నాయకత్వం వహించ డానికి తప్ప, విప్లవ సిద్ధాంతాలను బోధించటానికి లేదా విప్లవ పార్టీ లేదా ప్రజాసంఘాన్ని నిర్మించటానికి కాదు. కామ్రేడ్ మావో సేటుంగ్ ప్రబోధించిన 'ప్రజాయుద్ధ' సిద్ధాంతానికి ఈ 'చర్య'ల సిద్ధాంతం వ్యతిరేకమైనది. ఈ చర్యల కోసమే విద్యార్థులను గ్రామాలకు తరలమని కోరేట్లయితే, 'కళాశాలలను వీడండి' అనేది ఓ విప్లవ నినాదంగా వుండబోదు.

మరోవిషయం స్పష్టం చేయాలి. గ్రామాలకు తరలివెళ్ళే వారు విప్లవ ప్రేరణతోనే అలా చేసి వుండవచ్చు. అయితే, వారు దీనికొరకు అవసరమైన సంపూర్ణయోగ్యతను పొందలేకపోయినట్లయితే, వారు గంభీర విప్లవకృషిని చేయలేరు. విప్లవ పోరాటాన్ని, సంస్థను నిర్మించటం కష్టమైన పని. దృఢనిశ్చయం, సహనం, ధైర్యం మరియు సరైన సిద్ధాంత జ్ఞానం దీనికి అవసరం. గ్రామాలలోనో లేదా కార్మికుల బస్తీలలోనో విప్లవ సంస్థ నిర్మాణం కోసం కార్యకర్తలను అక్కడకు పంపే ముందుగా, వారు ఈ లక్షణాలను సంతరించుకున్నారో లేదో చూడాలి. వారిలో ఈ లక్షణాలు లేకున్నట్లయితే మంచి చేయటానికంటే వారు చెరపు చేస్తారు. కేవలం విప్లవ ప్రేరణతో మాత్రమే విప్లవసంస్థను నిర్మించలేము.

నిజమైన కమ్యూనిస్టుపార్టీని కలిగివుండట మనేది, విప్లవ విజయానికి మొదటి అవసరం. భారతదేశంలో విప్లవశక్తులు బ్రహ్మాండమైన వేగంతో పెరుగుతున్నాయి. విప్లవ పార్టీయొక్క సరైన నాయకత్వం వీరికి లేకపోతే, ఈ శక్తులు సరైన మార్గంలో ముందుకు సాగటంలో విఫలమౌతాయి. విప్లవ శిబిరంలో తగినంత సిద్ధాంత గందరగోళం నెలకొనివుంది. సరైన సిద్ధాంతాలను తప్పుగా అన్వయించటమో లేదా తప్పుడు సిద్ధాంతాలను ఆచరించటమో ఫలితంగా సరైన పంథా కనుగుణంగా విప్లవం ముందుకు సాగటంలేదు. నిజమైన విప్లవపార్టీ ఈనాటికీ ఆవిర్భవించలేదు. నిజమైన పార్టీ ఎప్పుడైతే వుండదో, అప్పుడు నిజమైన పార్టీ నిర్మాణానికి కృషిచేయటమే ప్రధానకర్తవ్యం అయితీరాలి. అంతేతప్ప, విచక్షణారహితంగా గ్రామీణ ప్రాంతాలకు విద్యార్థి

కార్యకర్తలను సమూహాలుగా పంపటం మాత్రంకాదు. నిజమైన పార్టీ నిర్మాణం కొరకు సిద్ధాంత పోరాటం కొనసాగించి తీరాలి. అన్నిరకాల పెడధోరణులపై అవిశ్రాంత సిద్ధాంత పోరాటాన్ని కొనసాగించాలి. అదేసమయంలో, ప్రతి విప్లవోద్యమ కార్యకర్త అన్నివర్గ పోరాటాలలోనూ, ప్రజాఉద్యమాలలోనూ పాల్గొనాలి. ఈ అన్ని పనులద్వారా ఓ విప్లవోద్యమ నాయకత్వం రూపుదాల్చి అభివృద్ధిచెందుతుంది.

విప్లవ పార్టీ నాయకత్వం మాత్రమే ఒక పద్ధతి ప్రకారం అవసరమైన సందర్భాలలో విద్యార్థులను వంతులవారీగా గ్రామీణ ఉద్యమాలలో పాల్గొనేందుకు పంపి, నాయకత్వపు అదుపుక్రింద వారికి సక్రమంగా మార్గదర్శకత్వం వహించగలుగుతుంది. ఎప్పుడైతే ఈ ప్రాథమిక విప్లవకృషి జరగదో, పాఠశాలలను, కళాశాలలను వీడండి అనే నినాదం విప్లవ రాజకీయాలనుండి ప్రక్కకు మళ్ళించేదేకాక, విద్యార్థిలోకంలో గందరగోళాన్ని, అరాచకాన్నీ సృష్టించే నినాదం కూడా అవుతుంది. పీడిత ప్రజానీకం నిరంతరాయ విప్లవ పోరాటాన్ని ఎప్పుడైతే కొనసాగిస్తారో, అప్పుడే విద్యార్థిలోకం విప్లవంలో నిలకడగా వుండగలుగుతుంది. 1949లో తెలంగాణా విద్యార్థులు తమ విద్యాసంస్థలనుండి బయటకొచ్చి రైతాంగంతో కలసి ఉద్యమంలో పాల్గొనటం, రైతాంగం తమ పోరాటాన్ని ఉచ్ఛదశకు తీసుకొని వెళ్ళిన తర్వాతనే జరిగింది. విప్లవమొదటి దశలో విద్యార్థులకు చేయటానికి పనివుండే మాట నిజమే. విప్లవ రాజకీయ చైతన్యం, ఆ స్వభావం కల పురోగామి విద్యార్థులు తప్పనిసరిగా రైతాంగాన్ని విప్లవ రాజకీయాలతో మేల్కొలపటానికి ఒక పద్ధతిప్రకారం గ్రామాలకు వెళ్ళాలి. ప్రత్యక్ష వర్గ పోరాటంలోకి కార్మికులను సంఘటితపరిచేందుకు పట్టణాల్లో విద్యార్థులు కార్మికులతో మమేకం కావాలి. ఈ పనులు చేయటంద్వారా గ్రామాలలో ఇంకా పెద్దరూపంలో జరిగే పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొనగలిగే లక్షణాలను పెంపొందించు కోగలుగుతారు. ఎవరైతే ఈ లక్షణాలను సంతరించు కున్నారో, వారు సహజంగా గ్రామీణ ప్రాంతంలో వృత్తి విప్లవకారులుగా వుండిపోతారు. విద్యార్థుల లోని పురోగామిశక్తులు పార్టీ నాయకత్వంలో ఈ పని సాగించాలి. పట్టణాలలో నివసించే విద్యార్థులే కాకుండా, గ్రామాలలో నివసించే విద్యార్థులు అనేకమంది వున్నారు. రైతాంగ విప్లవంలో గ్రామాలలో నివసించే విద్యార్థుల బాధ్యత గొప్పగా వుంటుంది. వారు రైతాంగానికి చాలా బాగా విప్లవ రాజకీయాలను బోధించవచ్చు. గ్రామాలలో నివసించే విద్యార్థులకు–కళాశాలలను, పాఠశాలను వదిలివేయకుండానే–గ్రామీణుల మధ్య కృషిసాగించే గొప్ప అవకాశముంది.

నగరాలు, పట్టణాలలోని పాఠశాలలు, కళాశాలలకు ప్రతిరోజూ గ్రామాలనుండి వచ్చి హాజరయ్యే విద్యార్థులు–పట్టణాలలోని కార్మికవర్గ పోరాటాల గురించిన జ్ఞానాన్ని సముపార్జించ గలగాలి. ఆనక తమతమ గ్రామాలలో ప్రజలను ప్రేరేపించి, నిలబెట్టటానికి ఈ జ్ఞానాన్ని ఉపయోగించవచ్చు. వారు అదే సమయంలో తమ గ్రామీణ జీవనం గురించిన, అక్కడి పోరాటాల గురించిన ప్రత్యేక జ్ఞానంతో నగరాలలోని విద్యార్థులను విజ్ఞానవంతం చేయాలి. ఈవిధంగా నగరాల్లోని విద్యార్థులు గ్రామీణ ప్రాంత వర్గ పోరాటాలతో ప్రత్యక్ష సంబంధంలోకి; గ్రామాలలోని విద్యార్థులు పట్టణ వర్గ పోరాటాలతో ప్రత్యక్ష సంబంధాలలోకి వచ్చి, తమతమ జ్ఞానాన్ని పరిశీలన చేసుకొంటారు. పైగా, పట్టణాలలోని, నగరాలలోని విద్యార్థులు తమ ఖాళీ సమయాలలో గ్రామీణ ప్రాంతాలలోని తమ విద్యార్థి మిత్రులవద్దకు, తమ స్వస్థలాలకు వెళ్ళటంద్వారా గ్రామీణ ప్రాంతం గురించిన తాజా ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందగలుగుతారు.

విద్యార్థి సంఘం ఒక రకపు ప్రజాసంఘమే. ప్రజాసంఘాలద్వారా పార్టీ తన రాజకీయాలను విశాల ప్రజారాశులమధ్య బోధించి, వ్యాపింప జేస్తుంది. కనుక, విద్యార్థి లోకానికి మొత్తంగా నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలను చేరవేసేందుకు కమ్యూనిస్టు పార్టీ ఖచ్చితంగా ఓ విద్యార్థి సంఘాన్ని కలిగి వుండాలి. పార్టీ నాయకత్వంలో పురోగామి విద్యార్థులు ఈ కృషి సాగిస్తారు. ఈ పురోగామి విద్యార్థులు నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలను వ్యాప్తి చేయటంలో సఫలీకృతులైనపుడు మాత్రమే, కార్మికవర్గ రాజకీయాలకు ప్రజాపునాదిని ఏర్పాటు చేయగలగటంతోపాటు, విద్యార్థి సమూహాన్ని విప్లవ ఐక్యసంఘటన పరిధిలోకి తీసుకురాగలుగుతారు. ఈ కృషి చేయకుండా 'కళాశాలలను వీడండి' నినాదంతో విద్యావ్యవస్థ స్థంభించిపోతుంది. విద్యార్థి లోకానికి చెందిన ఒక పెద్ద విభాగం, మధ్యతరగతి ప్రజలు విప్లవానికి వ్యతిరేకంగా వెళ్తారు. ప్రజారాశులలోని అధిక విభాగాలను తప్పనిసరిగా ఐక్యపరచ వలసిన ఈ నూతన ప్రజాస్వామిక లేక జనతా ప్రజాస్వామిక దశలో ఇది పెద్ద నష్టం. కొద్దిమంది విద్యార్థులు ముందుకు వెళ్ళినందువలన ఫలితమేమీ వుండదు. యావత్ విద్యార్థిలోకంలో రాజకీయాలను వ్యాపింపజేయాలి. విద్యార్థుల నడుమ సంఘం లేకుండా వున్నంతకాలం, విద్యార్థి లోకంలోని అత్యధిక విభాగం విద్యార్థులు విప్లవ రాజకీయాలలో పాల్గొనలేరు. 'కళాశాలలను వీడండి' నినాదం విప్లవోద్యమ ప్రయోజనాలకు ఏవిధమైన ప్రయోజనమూ చేకూర్చలేదు.

ఏదేని ఒక పనిని చేయబోయేముందు, అది మన లక్ష్యాన్ని ఎంతవరకు పురోగమింప జేయగలుగుతుందో మనం పరిశీలించుకోవాలి. పాఠశాలలు, కళాశాలల మూసివేతతో విప్లవోద్యమం పురోగమిస్తుందంటే, మనం అలానే చేయవచ్చు. కానీ వాస్తవాచరణలో ఇది ప్రతికూల ఫలితాల నిస్తోంది.

**నూతన సమాజాన్ని నిర్మించండి; దోపిడీదారుల ఆలోచనలు ధ్వంసించండి**

పెట్టుబడిదారీ విద్యావ్యవస్థను ధ్వంసంచేసి తీరాలి. కానీ, ఎలా? పరీక్షలను నాశనం చేయటం ద్వారానా? విద్యాసంస్థలను మూసివేయటం ద్వారానా? వీటిద్వారా అయితే మాత్రం కాదు. ప్రజల ప్రజాస్వామిక రాజ్యం ఏర్పడిన తర్వాతే అది సాధ్యమౌతుంది.

ప్రస్తుత సమాజ ఆర్థిక కట్టడంపై అనగా ఉత్పత్తి వ్యవస్థపై ఆధారపడిన ఉపరితల నిర్మాణంలో విద్యావ్యవస్థ ఒక భాగం. పూనాది కట్టడాన్ని మార్పుచేయకుండా ఉపరితల నిర్మాణం మౌలికంగా మారబోదు. కనుక, ప్రస్తుత విద్యా సంస్థలను ధ్వంసం చేయటంద్వారా మాత్రమే ఒక నూతన విద్యావ్యవస్థను స్థాపించటం సాధ్య మౌతుంది.

ఈ పెట్టుబడిదారీ విద్యావ్యవస్థకు సంకటస్థితి కల్గించకుండా, సవాళ్ళు విసరకుండా కొనసాగనిస్తే మనం విప్లవ కార్మికులం అవుతామా? అలా అనిపించకోము అనేది నిజమే. అన్ని ప్రతీఘాతుక అంశాలూ ఒకేతరహా విషయాన్ని కలిగివుంటాయని కామ్రేడ్ మావో మనకు బోధించారు. ఏ విధమైన తాపు తగలకుండా అవి వాటంతట అవే కూలిపోవు. శత్రువు సమర్థించిన వాటినన్నింటినీ మనం వ్యతిరేకిస్తాము. మనం అన్నిరంగాల్లో పోరాడు తాము. విద్య, సంస్కృతి అనేవి శత్రువుయొక్క ప్రధానమైన రంగాలలో ఒకటి. మనం వీటికి వ్యతిరేకంగా కూడా పోరాడాలి. కుళ్ళిపోతున్న వలసవాద, సామ్రాజ్యవాద సంస్కృతిలో ఈ విద్యావ్యవస్థ కూడా ఒక భాగంగా వుందని మనం రుజువుపరచాలి. కనుక ఈ వ్యవస్థ కూడా కూలదోయబడాలి. 1968లో కలకత్తా విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర విభాగానికి చెందిన కొందరు ఎగ్జామినర్లు అనేకమంది చెడ్డ విద్యార్థులనుండి లంచాలు తీసుకొని వారికి మంచి మార్కులిచ్చారు. విద్యార్థి ఉద్యమంద్వారా వారి నీచమైన చర్య బహిరంగమై, దానిపై ఓ విచారణ జరపవలసివచ్చింది. ఇక్కడ విద్యార్థులు ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

అలాగే కొన్ని సంవత్సరాల క్రితం కలకత్తా విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్ర విద్యార్థులు తమ పాఠ్యప్రణాళికకు వ్యతిరేకంగా ఓ ఉద్యమం ప్రారంభించి దానిని మార్చాలని డిమాండ్ చేశారు. ఈ రూపంలో వారు భ్రష్టుపట్టిన ఈ విద్యావ్యవస్థ స్వభావాన్ని వెల్లడి చేశారు. వారి ఉద్యమం సంపూర్ణంగా విజయం పొందలేకపోయినప్పటికీ, ఈ వ్యవస్థ పరిధిలో ఎలాంటి ప్రగతిశీల మార్పు కూడా తీసుకురాలేమని రుజువుపరిచింది. అందుకు ఈ వ్యవస్థ మొత్తం మారాలని స్పష్టంచేసింది. నూతన ప్రజాస్వామిక విప్లవంద్వారా మొత్తంగా సమాజాన్ని మార్చటంద్వారానే ఇది కూడా సాధ్యమౌతుంది. అయితే ఈ విధమైన ఉద్యమాల ద్వారా, ఇతర ప్రజాస్వామిక ఉద్యమాలద్వారా ఈ విద్యావ్యవస్థను దెబ్బలు కొడుతూనే వుండాలి. విశ్వవిద్యాలయాలలో ఇతర విద్యా, సాంస్కృతిక సంస్థలలోకి సామ్రాజ్యవాదం ప్రవేశించటాన్ని పెద్దసంఖ్యలో విద్యార్థులను సమీకరించి, బలమైన విద్యార్థి ఉద్యమాలద్వారా నిరోధించాలి. అదే సమయంలో, కళ, సాహిత్యం, నాటకం మొదలైన మాధ్యమాలద్వారా విద్యార్థులు ఓ విప్లవ సంస్కృతీ నిర్మాణానికి ప్రయత్నించాలి. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు తప్పనిసరిగా తమకు తాము బద్ధులు కావాలసిన చారిత్రక పరిమితులు ఇవి.

ooooo